రెండో ఇన్నింగ్స్‌లో కుదురుకున్న భారత్

పోరాటమే శరణ్యం

కోహ్లీ, సర్ఫరాజ్, రోహిత్ అర్ధ శతకాలు • తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ భారీ స్కోరు • రచిన్ రవీంద్ర సెంచరీ

బెంగళూరు టెస్టులో భారత్ గాడిన పడుతోంది! చిన్నస్వామి స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలిన టీమ్‌ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో ఎదురుదాడికి దిగింది. ఆట రెండోరోజు అలా క్రీజులోకి వచ్చి ఇలా పెవిలియన్‌కు వెళ్లిన భారత బ్యాటర్లు మూడో రోజు మాత్రం దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌ను కాపాడుకునేందుకు పోరాడుతున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యువ సంచలనం సర్ఫరాజ్ ఖాన్ అర్ధ శతకాలతో టీమ్‌ఇండియా కివీస్ ఆధిక్యాన్ని క్రమంగా కరిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగుల స్కోరు చేసి 354 పరుగుల తిరుగులేని ఆధిక్యాన్ని ఖాతాలో వేసుకున్న న్యూజిలాండ్ మూడో రోజు మూడు కీలక వికెట్లు పడగొట్టి ఇప్పటికీ టెస్టును శాసించే స్థితిలో ఉంది. మూడో రోజు ఆ జట్టు ఆటగాడు రచిన్ రవీంద్ర శతకంతో మెరవగా టిమ్ సౌథీ మెరుపులు మెరిపించడంతో భారీ స్కోరు సాధ్యమైంది. నాలుగో రోజు భారత మిడిలార్డర్ కివీస్ బౌలర్లను ఏ మేరకు అడ్డుకుంటుందనే దానిపై ఈ టెస్టులో భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. శనివారం మొత్తం ఆడగలిగి కివీస్ ముందు భారీ లక్ష్యం నిలపగలిగితే తప్ప ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి గండం నుంచి బయటపడే అవకాశం లేదు. ఈ మ్యాచ్‌లో రోహిత్ సేనకు ఇక మిగిలింది పోరాటమే!

బెంగళూరు: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బాధ్యాతారాహిత్యమైన ఆటతీరుతో 46 పరుగులకే ఆలౌట్ అయిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం దూకుడుగా ఆడుతోంది. టాపార్డర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ (102 బంతుల్లో 70, 8 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (78 బంతుల్లో 70 నాటౌట్, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), సారథి రోహిత్ శర్మ (63 బంతుల్లో 52, 8 ఫోర్లు, 1 సిక్స్) కివీస్ బౌలింగ్‌పై కౌంటర్ ఎటాక్‌కు దిగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 49 ఓవర్లలోనే 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. ఓవర్‌కు 4.7 సగటుతో పరుగులు రాబట్టిన రోహిత్ సేన.. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు కంటే ఇంకా 125 పరుగులు వెనుకంజలోనే ఉంది. అంతకముందు న్యూజిలాండ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 402 పరుగుల స్కోరు చేయడంతో ఆ జట్టుకు 356 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. రచిన్ రవీంద్ర (157 బంతుల్లో 134, 13 ఫోర్లు, 4 సిక్సర్లు), టిమ్ సౌథీ (73 బంతుల్లో 65, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) ధాటిగా ఆడి పర్యాటక జట్టుకు భారీ ఆధిక్యాన్ని అందించారు.

నిలబడ్డారు..

తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ పేసర్ల ధాటికి బెంబేలెత్తిన భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం నిలబడ్డారు. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (35), రోహిత్ కలిసి తొలి వికెట్‌కు 72 పరుగుల శుభారంభాన్ని అందించారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో ఈ ఇద్దరూ స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. కానీ అజాజ్ పటేల్ వేసిన 18వ ఓవర్లో ముందు కొచ్చి ఆడబోయిన జైస్వాల్.. స్టంపౌట్ అయి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. హెన్రీ 21వ ఓవర్లో 4, 6, 4తో 59 బంతుల్లోనే హిట్‌మ్యాన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ మరుసటి ఓవర్లోనే అజాజ్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడినా అది కాస్తా వికెట్లను పడగొట్టడంతో రోహిత్ నిరాశగా మైదానాన్ని వీడాడు. ఈ క్రమంలో కోహ్లీకి జతకలిసిన సర్ఫరాజ్.. ఆరంభం నుంచే కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అజాజ్, ఓరూర్కీ బౌలింగ్‌లో చూడచక్కని షాట్లతో బంతిని బౌండరీ లైన్ దాటించాడు. సర్ఫరాజ్ దూకుడుతో కోహ్లీ కూడా బ్యాట్‌కు పనిచెప్పాడు. అజాజ్ 30వ ఓవర్లో 6, 4, 4 బాదాడు. అతడే వేసిన 32వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో అభిమానులను అలరించాడు. ఇదే ఊపులో 42 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. టెస్టులలో అతడు ఆడిన 8 ఇన్నింగ్స్‌లలో ఇది నాలుగో అర్ధ శతకం కావడం విశేషం. కొద్దిసేపటికే కోహ్లీ సైతం ఈ ఏడాది టెస్టులలో తొలి అర్ధ శతకాన్ని సాధించాడు. ఈ ఇద్దరూ వంద బంతుల్లోనే శతక భాగస్వామ్యాన్ని పూర్తిచేశారు. మూడో రోజు ఆట ముగుస్తుందనగా గ్లెన్ ఫిలిప్స్ వేసిన 49వ ఓవర్లో ఆఖరి బంతి కోహ్లీ బ్యాట్‌ను ముద్దాడుతూ వెళ్లి కీపర్ బ్లండెల్ చేతిలో పడటంతో భారత్‌కు భారీ షాక్ తగిలింది. సర్ఫరాజ్-కోహ్లీ కలిసి మూడో వికెట్‌కు 136 రన్స్ జోడించారు.

రచిన్, సౌథీ దంచుడు

మూడో రోజు 180/3 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద బ్యాటింగ్‌కు వచ్చిన కివీస్ ఆరంభ ఓవర్లలోనే కీలక వికెట్లు కోల్పోయింది. మిచెల్ (18)ను సిరాజ్ ఔట్ చేయగా బ్లండెల్ (5)ను బుమ్రా వెనక్కి పంపాడు. ఫిలిప్స్ (14), హెన్రీ (8) వికెట్లు జడ్డూ ఖాతాలోకి వెళ్లాయి. కానీ సౌథీతో కలిసి కివీస్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఈ ఇద్దరూ వన్డే తరహా ఆట ఆడారు. ఈ భాగస్వామ్యాన్ని విడదీయడానికి రోహిత్ పదే పదే బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. లంచ్ విరామానికి ముందే తన కెరీర్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్న రచిన్.. ఆ తర్వాత జోరు పెంచాడు. మరో ఎండ్‌లో సౌథీ కూడా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. హాఫ్ సెంచరీ తర్వాత సౌథీ నిష్క్రమించడంతో 134 పరుగుల 8వ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రచిన్‌ను కుల్‌దీప్ ఔట్ చేయడంతో కివీస్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.



కోహ్లీ @ 9 వేలు

పరుగుల యంత్రం కోహ్లీ ఈ మ్యాచ్‌లో అర్ధ శతకం సాధించడంతో టెస్టులలో 9వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. వ్యక్తిగత స్కోరు 53 పరుగుల వద్దకు చేరుకోగానే అతడు ఈ ఘనతను అందుకున్నాడు. తద్వారా భారత్ తరపున ఈ ఘనత సాధించిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. సచిన్ (15,921), ద్రావిడ్ (13,265), గవాస్కర్ (10,122) కోహ్లీ కంటే ముందున్నారు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46 ఆలౌట్
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 402 ఆలౌట్ (రచిన్ 134, కాన్వే 91, జడేజా 3/72, కుల్‌దీప్ 3/99), **భారత్ రెండో ఇన్నింగ్స్:** 231/3 (కోహ్లీ 70, సర్ఫరాజ్ 70 నాటౌట్, అజాజ్ 2/70)

453
మూడో రోజు ఆటలో నమోదైన పరుగులు. టెస్టులలో ఒక రోజు ఆటలో ఇన్ని పరుగులు చేయడం భారత్‌లో ఇది రెండోసారి. 2009లో శ్రీలంక, భారత్ కలిసి 470 పరుగులు చేయడమే ఇప్పటివరకూ అత్యుత్తమం.

సుకన్యకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గోవా వేదికగా జరుగుతున్న ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ లిఫ్టర్ తేజావత్ సుకన్యా భాయ్ కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన మహిళల 76కిలోల విభాగం ఫైనల్లో సుకన్య 100కిలోలు ఎత్తి మూడో స్థానంలో నిలిచింది. ఇదే కేటగిరీలో సేజల్ మోనికర్ (మహారాష్ట్ర), వెనిజుల అన్నె (కర్ణాటక) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

ఉత్తరాఖండ్ 313/8

డెహ్రాడూన్: హైదరాబాద్, ఉత్తరాఖండ్ మధ్య రంజీ గ్రూపు-బీ మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతున్నది. శుక్రవారం తొలుత టాస్ గెలిచిన హైదరాబాద్..బౌలింగ్ ఎంచుకుంది. అమ్నిశ్(89), ఆదిత్య తారె(69) అర్ధసెంచరీలతో ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 313/8 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఉత్తరాఖండ్ బ్యాటర్లు పరుగులు కొల్లగొట్టారు. ముఖ్యంగా అమ్నిశ్ జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించాడు. తనయ్ త్యాగరాజన్(3/83) మూడు వికెట్లతో ఆకట్టుకోగా, రోహిత్‌రాయుడు(2/16) రెండు వికెట్లు తీశాడు.

సింధు ఓటమి

ఓడెన్స్: డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. క్వార్టర్స్‌లో సింధు.. 13-21, 21-16, 9-21తో గ్రెగొరియా టున్‌జుంగ్ (ఇండోనేషియా) చేతిలో ఓటమిపాలైంది. తొలి రౌండ్ నుంచే ఆధిక్యం ప్రదర్శించిన టున్‌జుంగ్ జోరుకు సింధు తలవంచక తప్పలేదు. రెండో గేమ్‌లో సింధు పుంజుకున్నా నిర్ణయాత్మక మూడో గేమ్‌లో టున్‌జుంగ్ ధాటికి భారత షట్లర్‌కు పరాభవం తప్పలేదు. సింధు ఓటమితో ఈ టోర్నీలో భారత్ పోరాటం కూడా ముగిసినట్టైంది.

చెస్ మాస్టర్స్ చాంప్ అర్జున్

లండన్: యువ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేసి మరో ప్రతిష్టాత్మక టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. బ్రిటన్‌లో జరిగిన డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ ట్రోఫీని అర్జున్ సొంతం చేసుకున్నాడు. శుక్రవారం మాక్సైమ్ వచియర్-లగ్రవె (ఫ్రాన్స్)తో ముగిసిన ఫైనల్‌లో రెండు గేమ్‌లను డ్రా చేసుకున్న అర్జున్ టైటిల్ విజేతగా నిలిచాడు. 16 మంది పాల్గొన్న ఈ టోర్నీలో అతడు ఓటమన్నదే లేకుండా రాణించాడు. ఫైనల్‌లో ఒక్క గేమ్‌ను గెలిచినా అర్జున్ ఎలో రేటింగ్ 2,800 పాయింట్లకు చేరుకునేవాడు. కానీ డ్రాతో అతడు 2,797తో మూడో స్థానంలో నిలిచాడు.

టైటాన్స్ బోణీ

• ప్రొ కబడ్డీ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. శుక్రవారం స్థానిక గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో టైటాన్స్ 37-29 తేడాతో బెంగళూరు బుల్స్‌పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తమదైన జోరు కనబరిచిన టైటాన్స్..బెంగళూరుపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్(13 పాయింట్లు) రైడింగ్‌లో సూపర్-10తో విజృంభిస్తే..డిఫెండర్ క్రిషన్ ధుల్(6) రాణించడంతో టైటాన్స్ గెలుపు సులువైంది. ఈ మ్యాచ్‌లో పవన్ పీకేఎల్‌లో 1200 రైడ్ పాయింట్ల మైలురాయిని అందుకోవడం విశేషం. మరోవైపు బెంగళూరు జట్టులో సురేందర్ దహల్(5), జతిన్(4) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఇదిలా ఉంటే మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 36-28తో యు ముంబాపై గెలిచింది. అషు మాలిక్(10) ఢిల్లీ విజయంలో కీలకంగా వ్యవహరించాడు.

ఫైనల్‌లో న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా

షార్జా: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ ఫైనల్ చేరింది. శుక్రవారం వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో కివీస్ 8 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో అమీతుమీకి సిద్ధమయ్యారు. విండీస్‌ను గెలిపించేందుకు డియోండ్ర డాటిన్ బంతి (4/22)తో పాటు బ్యాట్ (22 బంతుల్లో 33, 3 సిక్సర్లు)తోనూ పోరాడినా ఫలితం వారికి అనుకూలంగా రాలేదు. తొలుత కివీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులే చేసింది. ప్లిమ్మర్ (33) టాప్ స్కోరర్. అయితే స్వల్ప ఛేదనలో విండీస్ కూడా తడబడింది. న్యూజిలాండ్ స్పిన్నర్లు ఈడెన్ కార్సన్ (3/29), అమెలియా కెర్ (2/14) కట్టడి చేయడంతో వెస్టిండీస్.. 20 ఓవర్లలో 120/8కే పరిమితమైంది. డాటిన్ పోరాడినా మిగిలిన బ్యాటర్లు చేతులెత్తేయడంతో ఆ జట్టు ఓటమి వైపున నిలిచింది.

పాక్‌దే రెండో టెస్టు

స్పిన్నర్లకు 20 వికెట్లు

ముల్తాన్: సొంతగడ్డపై 11 టెస్టు మ్యాచ్‌ల అనంతరం (సుమారు మూడున్నరేండ్ల తర్వాత) పాకిస్థాన్‌కు ఎట్టకేలకు ఓ విజయం దక్కింది. స్వదేశంలో ఇంగ్లండ్‌తో ముల్తాన్ వేదికగా జరిగిన రెండో టెస్టును ఆ జట్టు 152 పరుగుల తేడాతో గెలుచుకుంది. నాలుగో రోజు విజయానికి 261 పరుగులు చేయాల్సిన దశలో ఓవర్ నైట్ స్కోరు 36/2 వద్ద బ్యాటింగ్ ఆరంభించిన ఇంగ్లండ్.. 144 పరుగులకే కుప్పకూలింది. పాక్ స్పిన్నర్ నోమన్ అలీ (8/46), సాజిద్ ఖాన్ (2/93) ఇంగ్లీష్ జట్టును కట్టడిచేశారు. బెన్ స్టోక్స్ (37), బ్రైండన్ కార్స్ (27) పాక్ విజయాన్ని ఆలస్యం చేశారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ వికెట్లన్నీ (రెండు ఇన్నింగ్స్‌లలో) సాజిద్ ఖాన్, నోమన్ అలీకే దక్కడం గమనార్హం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.